# వరద ఉధృతిలో తాండూర్ పోలీసుల సాహసం

## ప్రాణాలకు తెగించి.. గర్భిణిని ఒడ్డుకు చేర్చిన పోలీసులు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

రెండు రోజులుగా కురుస్తున్న తెలంగాణ రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. మహారాష్ట్ర సరిహద్దు జిల్లాలైన మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలను వరద ముంచెత్తుతున్నది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని నర్సాపూర్ గ్రామంలో వాగు నీరు ఉధృతంగా ఉండటంతో గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ క్రమంలో ఓ గర్భిణి వైద్య చికిత్స కోసం గ్రామం నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చింది. అయితే వాగు ఉధృతి కారణంగా కుటుంబ సభ్యులు స్వయంగా ఆమెను దాటించేందుకు ప్రయత్నించినా విఫలమయ్యారు. విషయం తెలిసిన వెంటనే తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వరద ఉధృతిని లెక్క చేయకుండా తాడు సాయం తో వాగు దాటి అవతలి వైపు వెళ్లారు.. గర్భిణిని భుజాన మోసుకుంటూ సురక్షితంగా మరోవైపు చేర్చారు. తరువాత ఆమె ను అత్యవసరంగా ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చేశారు. ఈ సంఘటన జిల్లాలో చర్చనీయాంశమైంది. తమ ప్రాణా లకు తెగించి అత్యవసర సమయంలో సహా యం చేసిన పోలీసులకు గర్భిణి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి పోలీసులు చేసిన ఈ రక్షణ చర్యను ప్రజలు ప్రశంసిస్తున్నారు.



# ఆదివాసీల ఇళ్లను ధ్వంసం చేయం సరికాదు

- ఫారెస్ట్, పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభంజనం

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



జన్నారం కవ్వాల్ అభయారణ్యంలో పాలగోరి గూడెం ఆదివాసీలకు సర్వే నంబరు హక్కు పత్రం ఉన్నప్పటికీ, ఫారెస్ట్–పోలీస్ అధికారులు దాడులు చేసి గూడెన్ని ఖాళీ చేయించారని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభంజనం ఆరోపించారు. ఆగస్టు 9న అధికారుల బృందం బుల్డోజర్లతో గుడిసెలను కూల్చి, రూ.6.50 లక్షలు, రూ.70 వేల విలువ చేసే సోలార్ లైట్లు తీసుకెళ్లినట్టు తెలిపారు. కోళ్లు, మేకలు, పశువులను కూడా స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసి దినం రోజునే ఆదివాసీలను ఇళ్ల నుండి వెళ్లగొట్టడం తప్పని విమర్శించారు. నిరక్షరాస్యులైన అమాయకులను రోడ్డున పడి వేయడం అన్యాయం అని అన్నారు. తీసుకున్న డబ్బులు, సెల్‌ఫోన్లు తిరిగి ఇవ్వడంతో పాటు, ఇళ్లు ధ్వంసం చేసిన అధికారులపై కోర్టు సుమోటో కేసు నమోదు చేసి విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.

## సాంకేతిక అభ్యసనం విద్యార్థులకు వరం

### ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకం: డీఈఓ యాదయ్య



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** సాంకేతిక అభ్యసనం విద్యార్థులకు ఒక వరమని, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా కంప్యూటర్ ఆధారిత అభ్యసనాన్ని అందించాలనే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య పేర్కొన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, జిల్లాలోని ఎంపిక చేసిన వందమంది గణితం బోధించే ప్రాథమిక ఉపాధ్యాయులకు సాంకేతిక అభ్యసనంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సమర్థవంతంగా విద్యార్థులకు చేరవేయాలని సూచించారు. త్వరలోనే దశలవారీగా అన్ని ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు అందించబడతాయని, వాటి ద్వారా నాణ్యమైన బోధన, స్వీయ అభ్యసన, స్వీయ సాధన సులభతరమవుతుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఈ నెలాఖరులో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో అందరు ఉపాధ్యాయులకు తెలియజేసి కార్యక్రమం ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, రిసోర్స్ పర్సన్లు, వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అత్యవసరమైతే తప్ప బయటికి రాకండి

### రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

**శెనార్తి మీడియా, మంచిర్యాల /రామగుండం :** రానున్న 72 గంటలపాటు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. అత్యవసర పరిస్థితులు తప్ప ఇంటి బయటకు రాకూడదని ప్రజలకు సూచించారు. కమిషనరేట్ పరిధిలోని ప్రజల భద్రత కోసం డ్యాంలు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్రృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, చెరువుల వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు. వర్షాల సమయంలో చెట్ల కింద, పాడైన భవనాల్లో, విద్యుత్ స్తంభాల దగ్గర ఉండరాదని, చేపల వేటకు వెళ్లరాదని చెప్పారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రధాన రహదారులపై నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారంతో పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు.



## నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు..

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియట్ చదువుతున్న నిరుపేద విద్యార్థులకు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో, కలెక్టర్ చాంబర్లో సంస్థ డివిజనల్ మేనేజర్ రెల్ల చంద్రశేఖర్, సీనియర్ ఏరియా మేనేజర్ పోకల నరసింహారావు, చెన్నూర్ శాఖ మేనేజర్ సిరిపంగి నాగరాజు, పెద్దపల్లి శాఖ మేనేజర్ శ్రీధర్‌లతో కలిసి విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన దమ్ము లాస్య, తోటపెల్లి మౌనిక, సందనవేని పూజ, గౌమాస అశ్రితలకు ఇంటర్మీడియట్ విద్య కోసం ఉపకార వేతనాలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై అవగాహన

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించి, అనంతరం సెమినార్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. అధ్యాపకులు డాక్టర్ హరీష్ కుమార్, డాక్టర్ టీ.గంగ య్య, ఎం.కుమారస్వామి, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థినీ–విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని యాంటీ డ్రగ్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు.



# ప్రతి విద్యార్థికి విద్యా ప్రోత్సాహం

### ప్రభుత్వం సదుపాయాలు కల్పిస్తుంది: కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి చదువుకు నేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం మందమర్రి మండల కేంద్రంలోని కార్మెల్ డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఫాదర్ ఫిలిప్‌లతో కలిసి హాజరై కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ఉన్నత విద్యతో సమాజంలో గౌరవం పెరుగుతుందని, చదువు దైనందిన జీవితంలో ఎంతో అవసరమని తెలిపారు. బాల్యం నుంచే క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదువుకోవాలని, విద్యతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని సూచించారు. ప్రభుత్వం 10 వేల నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందిస్తున్నదని, మంచిర్యాల జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అభినందించారు. గత సంవత్సరం నీటి, రహదారి సదుపాయాలపై శ్రద్ధ పెట్టిన ప్రభుత్వం, ఈ సంవత్సరం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మందమర్రి మండలంలో డిగ్రీ కళాశాల ప్రారంభం ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం విద్యతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని, పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల కోసం జిల్లాలో నాలుగు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తోందని తెలిపారు. టాటా సంస్థ సమన్వయంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి అధునాతన సాంకేతికతలపై కోర్సులు అందిస్తున్నట్లు చెప్పారు. చెన్నూర్‌లో 1 కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తున్నా మని, 2047 నాటికి తెలంగాణను దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షా లకు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** రాబోయే మూడు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రజా రక్షణ చర్యల్లో నిమగ్నం కావాలని, వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, ప్రాజెక్టులు, ఉధృతంగా ప్రవహించే నదులు, వాగుల వద్దకు ఎవరూ వెళ్లరాదని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్ల సమీపానికి వెళ్లకూడదని, రైతులు పొలాలలో మోటార్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు. జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో 08736-250501 నంబర్‌తో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, తక్షణ సహాయ సేవలు అందుబాటులో ఉంచామని తెలిపారు. వరద పరిస్థితులు, ఇతర ఘటనల సమాచారాన్ని వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు.

# భారీ వర్షాల్లో విద్యుత్ జాగ్రత్తలు

- సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ జాడే విజ్ఞప్తి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

ఈ నెల 16 వరకు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా రైతులు అత్యంత జాగ్రత్తలు పాటించాలని మంచిర్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ జాడే సూచించారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తున్నామని, మెన్–మెటీరియల్ సిద్ధంగా ఉంచామని, ట్రాన్స్ఫార్మర్ వాహనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఉద్యోగులకు షిఫ్ట్ విధానంలో 24 గంటల విధులు కేటాయించామని, విద్యుత్ అంతరాయం కలిగితే పునరుద్ధరణ టీంలు తక్షణమే చర్యలు తీసుకుంటాయని చెప్పారు. అవసరమైతే 87124 83945 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. తెగిపోయిన, వేలాడుతున్న లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదని, ప్రమాదకర పరిస్థితులు గమనించిన వెంటనే టీజీఎన్‌పీడీసీఎల్ టోల్‌ఫ్రీ 1912కి సమాచారం ఇవ్వాలని కోరారు. నాణ్యతలేని పంపుసెట్ల వినియోగం ప్రమాదకరమని హెచ్చరిస్తూ, మోటార్లు, పైపులు, ఫుట్ వాల్వులను తాకరాదని సూచించారు. రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్ పనులు చేయకుండా అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్ సహాయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఎబి స్విచ్లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలు సరిచేయడం వంటి పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదని హెచ్చరించారు.

## మహిళా సిబ్బందికి చీరలు, పండ్ల పంపిణీ

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**




లయన్స్ క్లబ్ మంచిర్యాల సీనియర్ లయన్ మెంబర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు వి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మాతా శిశు కేంద్రంలో మహిళా శానిటరీ వర్కర్స్‌కి 30మందికి చీరలు పంపిణీ చేశారు. అనంతరం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో సికిల్ సెల్ చిన్నారులకు బ్రెడ్, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీసన్ చైర్‌పర్సన్ కొత్త సురేందర్, సీనియర్ లయన్ వినయ్‌కుమార్, మాతా శిశు కేంద్ర హెడ్ నర్సులు అరుణ విరోనిక, అపరంజి, భారతి, సిబ్బంది, రక్తనిధి కేంద్ర సూపర్వైజర్ కే మాధవి, విజయ్‌కుమార్, మణికంఠ, మౌనిక, రజితె ఏఎన్ఎం, రజిత రిసెప్షన్ ఈస్ట్, లావణ్య, సుజాత, శైలజ, రవికిరణ్, వేణు, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా నిరసన

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**





బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా, భారత వ్యవసాయానికి ప్రతికూలంగా ఉన్న విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.లాల్‌కుమార్ మాట్లాడుతూ... కేంద్రం అమెరికా–ఇంగ్లాండ్ ఒప్పందాల నుంచి తప్పు కోవాలని కోరారు. ఇటువంటి ఒప్పందా లు జాతీయ ప్రయోజనాలకు హానికరమని, వ్యవసాయం, మధ్యతరహా పరిశ్రమలు దెబ్బ తింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో చర్చ లేకుండా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు అమలు చేయడం సరికాదని విమర్శించారు. అన్ని పంటలకు సి2 ప్లస్ 50% కనీస మద్దతు ధర, రైతులకు–వ్యవసాయ కార్మికులకు రుణ మాఫీ, భూసేకరణ, పారిశ్రామిక టౌన్‌షిప్‌లు, స్మార్ట్ మీటర్ల అమలు నిలిపివేయాలని, గ్రామీణ గృహాలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా లోటు, సన్న ధాన్యం బోనస్ ఆలస్యం, అమెరికా పాలు దిగుమతులు రైతులను దెబ్బతీస్తాయని హెచ్చరించారు. ట్రంప్ ఒత్తిళ్లకు మోడీ తలొగ్గడం దేశ సార్వభౌమత్వానికి ముప్పని వ్యాఖ్యానించారు. కార్మిక చట్టాల రద్దు, 10 గంటల పని విధానం అమలు దారుణమని అన్నారు. ఈ నిరసనలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దొండ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకే రవి, ఉపాధ్యక్షులు చందు, అరుణోదయ రాష్ట్ర నాయకులు మల్లన్న, సీఐటీయూ నాయకులు ప్రకాష్, రంజిత్, సిపిఐ రైతు సంఘం నాయకులు భానేష్, చందు, ఐఎఫ్టియు నాయకులు సురేందర్, రాజేశం, రాజన్న తదితరులు పాల్గొన్నారు

# నానితో శేఖర్ కమ్ముల మూవీ

## టాలీవుడ్‌లో తాజా చర్చ

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతున్న విషయం తెలిసిందే. ఆయన తెరకెక్కించిన ప్రతి చిత్రం కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లే రాబట్టింది. ఇటీ-వల కుబేర అనే చిత్రంతో పలకరించాడు. ఈ మూవీ కూడా మంచి విజయం సాధించింది. ఇక ఇప్పుడు నానితో ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నేచరల్ స్టార్ నాని తన కెరీర్‌ను వైవిధ్యంగా మలుస్తున్నాడు. ప్రేమకథలతో, కుటుంబ డ్రామాలతో ప్రేక్షకుల మనసు దోచిన నాని, ఇటీవల 'హిట్ 3'లాంటి డార్క్ యాక్షన్ థ్రిల్లర్‌తో వైవిధ్యాన్ని చూపించాడు. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ మూవీ చేయనున్నాడనే వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవలే 'కుబేర' మూవీతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన శేఖర్ కమ్ముల, నానితో కలిసి ఎలాంటి కథను సినిమాగా తీయ-బోతున్నారా అనే ఆసక్తి పెరుగుతోంది. వీరిద్దరి కాంబినేష-న్‌లో ఇది తొలి సినిమా కావడం, ఇద్దరికీ భిన్నమైన ఫాలోయింగ్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అప్పుడే హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో హీరోయిన్‌గా సాయిపల్లవి పేరు వినిపిస్తుంది. ఇది నిజమైతే, ఇది నాని - సాయిపల్లవి జోడీకి మూడో సినిమా అవుతుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'ఎంసీఏ' (2017), 'శ్యామ్ సింగరాయ్' (2021) మంచి విజయం సాధించాయి. ప్రేక్షకుల నుంచి హిట్ పెయిర్‌గా గుర్తింపు కూడా పొందారు. శేఖర్ కమ్ములకు సాయిపల్లవి ఫేవరెట్ హీరోయిన్. ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఫిదా' ఆమెకు స్టార్‌డమ్ తీసుకొచ్చింది. ఆ తర్వాత 'లవ్‌స్టోరీ' కూడా మంచి స్పందన తెచ్చుకుంది. తెలంగాణ యాసలో సాయిపల్లవి చెప్పిన డైలాగులు ఇప్పటికీ ప్రేక్షకులను ఆకట్టు-కుంటు-న్నాయి. ఇప్పుడు అదే దర్శకుడు, అదే హీరోయిన్, కొత్తగా నానితో జత కట్టడం విశేషం. సాయిపల్లవి ఇటీవలే నాగచైతన్యతో నటించిన 'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ మైథాలజికల్ మూవీ 'రామా-యణ' లో సీత పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా నటించగా, 2026 లేదా 2027 దీపావళికి రిలీజ్ చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే నాని - శేఖర్ కమ్ముల ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.





# పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబై సంస్థ కేసు

## రాజాసాబ్ విడుదలపై ప్రభావం




టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థపై కేసు నమోదయింది. తమను మోసం చేసారని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబైకి చెందిన ఐవివై ఎంటర్‌టెన్‌మెంట్స్ కేసు పెట్టింది. వివరాలలోకెళితే పీపుల్స్ మీడియా సంస్థ నిర్మాణంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రాజాసాబ్ అనే సినిమాను నిర్మిస్తోంది. అత్యంత భారీ బడ్జెట్ పై చాలా కాలంగా ఈ సినిమాను నిర్మిస్తోంది పీపుల్స్ మీడియా. అయితే వందల కోట్ల బడ్జెట్ తో పీపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ సినిమాకు ముంబై కు చెందిన ఈ సంస్థ ఆర్థిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. సినిమా షూటింగ్ కు అయ్యే ఖర్చు తదితర వాటికి ఆర్థిక వనరులు సమకూర్చేలా ఇరు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. గ్రాండ్‌గా షూటింగ్ స్టార్ట్ చేసిన పీపుల్ మీడియా మేకర్స్ ఈ సినిమా షూటింగ్ ను అనుకున్న టైమ్ లో ఫినిష్ చేయలేక పోయారు. ఇప్పటికే రాజాసాబ్ అనేకసార్లు రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పీపుల్ మీడియా తమ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, సినిమా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయజేకుండా, తమకు ఎలాంటి సమాచారం అందించడం లేదని, మేము ఇచ్చిన డబ్బులు ఎలా ఉపయోగించారనే దానిపై వివరణ కూడా వివరన ఇవ్వలేదని చెబుతూ ఢిల్లీ కోర్టులో కేసు నమోదు చేసింది. అలాగే మేము ఇచ్చిన డబ్బులో ప్రస్తుతం రూ. 218 కోట్లు- తిరిగి ఇవ్వాలని ఈ సంస్థ డిమాండ్ చేస్తోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా ఇంకా నాన్-థియేట్రికల్ డీల్‌ను క్లోజ్ కాలేదని, అనుకొని కారణాల వలన రిలీజ్ వాయిదా వేసామని కావాలని తమ పరువుకు భంగం కలిగింస్తున్నారని ఐవివై సంస్థపై కోర్టును ఆశ్రయించింది పీపుల్స్ మీడియా.

# జల్సా.. మరోమారు విడుదల



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న ఆయన అభిమానుల కోసం 'జల్సా' సినిమాను మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఈ విషయాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. గతంలో 2022లో కూడా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'జల్సా' సినిమాను 4కె వెర్షన్‌లో రీ-రిలీజ్ చేశారు. అయితే అప్పుడే ఈ చిత్రం రూ.3 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి రీ-రిలీజ్ సినిమాల్లో కొత్త రికార్డులను సృష్టించింది. అయితే ఈ సినిమాను మళ్లీ చూడటానికి అభిమానులు ఆసక్తి చూపుతుండడంతో సెప్టెంబర్ 2న రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్.


# కవర్ స్టిల్‌తో మంట పెట్టిన రకుల్

తెలుగు ప్రేక్షకులకు కెరటం సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్‌కి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో హిట్ దక్కింది. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వెంటనే రకుల్ ప్రీత్ సింగ్‌కి టాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కాయి. మెల్ల మెల్లగా స్టార్ హీరోల సినిమాలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచిన రకుల్ ప్రీత్ సింగ్ ఐదేళ్ల పాటు వరుస సినిమాలు చేసింది. ఒకానొక సమయంలో స్టార్ హీరోల సినిమాలకు సైతం డేట్లు ఇవ్వలేని స్థాయిలో బిజీగా సినిమాలు చేసింది. కానీ కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు కదా, తెలుగులో ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. టాలీవుడ్‌లో ఆఫర్లు తగ్గిన సమయంలో ఈ అమ్మడికి బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ ఆరంభం నుంచి సినిమాలతోనే కాకుండా అందమైన ఫోటోలతోనూ ఆకట్టుకుంటూ వస్తోంది. తాజాగా మరోసారి ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ వార్తల్లో నిలిచింది. ఈసారి ప్రముఖ మ్యాగజైన్ బ్రైడ్స్ టుడే కవర్ పేజ్ పై రకుల్ ప్రీత్ సింగ్ మెరిసిపోయింది. నడుము అందం చూపిస్తూ అందమైన నాభి అందాలను చూపించడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ చూపు తిప్పనివ్వడం లేదు. ఆకట్టుకునే అందంతో పాటు, కన్నుల విందు చేసే విధంగా రకుల్ ప్రీత్ సింగ్ మేకోవర్ ఉంది. ఇంతటి అందమైన రకుల్ ప్రీత్ సింగ్‌కు ఇంత త్వరగా ఇండస్ట్రీ ఉద్వాసన పలకడం ఏ మాత్రం బాగా లేదు అంటూ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## మోనికాని బాలీవుడ్ అలా చూస్తోందా?

పూజాహెగ్డే కెరీర్ ఎలా ప్రారంభమైందో తెలిసిందే. కోలీవుడ్ లో మొదలైన ప్రస్తానం అటుపై టాలీవుడ్ అక్కడ నుంచి బాలీవుడ్ కి వెళ్లింది. పుట్టి పెరిగింది ముంబై కావడంతో బాలీవుడ్ లోనే స్థిరపడాలని ప్లాన్ చేసుకుంది. కానీ కెరీర్ అక్కడ మాత్రం ఆశించిన విధంగా సాగలేదు. సౌత్ లో వచ్చినట్లు అవకాశాలు హిందీ పరిశ్రమ లో రాలేదు. పదేళ్ల ప్రస్తానం తెలుగు, తమిళ సినిమాలే ఎక్కువగా చేసింది. హిందీలో నాలుగైదు సినిమాలకే పరిమితమైంది. ఆ నాలుగు కూడా పెద్దగా సక్సస్ అవ్వలేదు. అలా పూజాహెగ్డే బాలీవుడ్ కి సపరేట్ గా మారింది. ముంబై బ్యూటీ అయినా బాలీవుడ్ లో మాత్రం అవకాశాలు రాలేదు. తాజాగా ఈ అంశంపై పూజాహెగ్డే తొలిసారి స్పందించింది. ఇప్పటి వరకూ బాలీవుడ్ అంటే పాజిటివ్ గానే స్పందించిన అమ్మడు కాస్త స్వరం మార్చినట్లే కనిపిస్తోంది. హిందీ దర్శక, రచయితలు తనని కేవలం గ్లామర్ డాల్ గానే చూ-స్తు న్నారంది. నటిగా తన లో ట్యాలెంట్ ను గుర్తించలేకపోతున్నారంది. తన ట్యాలెంట్ గురించి తెలియా లంటే సౌత్ లో తాను నటించిన సినిమాలు చూడాలని సూచించింది. తాను కేవలం ఐటం పాటలకు...ప్రత్యేక పాత్రలకు పరిమితమయ్యే నటని కాదని పేర్కొంది. అలాగే హిందీలో ఇంత వరకూ సరైన సినిమాలు గానీ, పాత్రలు గానీ పడలేదని అసహనం వ్యక్తం చేసింది. తనని సౌత్ వాళ్లు నమ్మినట్లు నార్త్ వాళ్లు నమ్మడం లేదా? అన్న సందేహాన్ని వ్యక్తం చేసింది. బాలీవుడ్ పై అమ్మ డు ఇంత వరకూ ఇలాంటి వ్యాఖ్యలు ఎన్నడూ చేయలేదు. హిందీ పరిశ్రమ అంటే పాజిటివ్ గానే స్పందించేది. కానీ అవకాశాలు రాకపోయే సరికి పూజాహెగ్డే తిరుగు బావుటా ఎగరేసినట్లే కనిపిస్తోంది.



# కూలీ, వార్-2లకు పోటీగా ధూమకేతు

## బెంబేలెత్తిస్తున్న బెంగాల్ మూవీ

ఆగస్టు 14న గురువారం కూలీ, వార్2 మూవీలు పెద్ద ఎత్తున రిలీజ్ కాబోతున్నాయి. వీటిపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. మకూలీలో సీనియర్ యాక్టర్లు వార్2లో యంగ్ అండ్ డైనమిక్ హీరోలు మీ సినిమానా మా సినిమానా అన్నట్లుగా పోటీ- పడుతున్నారు. ఎవ్వరూ ఎక్కడా తగ్గట్లేదు. ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించేందుకు చేస్తున్న ప్రమోషన్స్ పీక్స్‌కి చేరాయి. ఈ దశలో మరో మూవీ రిలీజ్ అయ్యేందుకు సాహసం చేస్తుందా. కానీ మేం చేస్తాం అంటోంది ఓ బెంగాలీ ఫిల్మ్. వార్2, కూలీ చిత్రాలతో పోటీ పడుతూ 'ధూమకేతు' అనే బెంగాలీ ఫిల్మ్ పశ్చిమ బెంగాల్లో ఆగస్టు 14నే రిలీజ్ అవుతోంది. వార్2, కూలీకి ఈ సినిమాకు ఏంటీ- పొంతన అని తక్కువగా తీసిపారేయొద్దు. ఉత్తరాదిలో వార్2. సౌత్‌లో కూలీ సినిమాలకు ఫుల్ అటెన్షన్ క్రియేట్ అవుతుంది. కానీ బెంగాల్‌లో మాత్రం ధూమకేతుకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఎంతలా అంటే ప్రీ బుకింగ్స్ సేల్స్‌లో ఈ లోకల్ సినిమాను వార్2 కూడా బీట్ చేయ-లేనంతలా. ధూమకేతు ఇప్పటి వరకు 21 వేల టికెట్లు- అమ్ముడవగా, వార్2కి కేవలం 6 వేల టికెట్లు- మాత్రమే తెగాయన్నది మార్కెట్ వర్గాల టాక్. ఇక కూలీని పెద్దగా పట్టించుకోవడం లేదు బెంగాల్ ఆడియన్స్. ఈరేంజ్ బిజినెస్ ఇప్పటి వరకు ఏ బెంగాలీ సినిమాకి జరగలేదని అంటున్నాయి అక్కడి మార్కెట్ వర్గాలు. అంతేకాదు బెంగాల్ వ్యాప్తంగా తొలి రోజే 400 ప్లస్ షోలు పడనున్నాయట. రన్నింగ్‌లో ఈ సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉందట. ఇంతలా హైప్ క్రియేట్ చేస్తున్న ధూమకేతు .. ఈ మధ్యలో తెరకెక్కిన ఫిల్మ్ కూడా కాదు.. ఎప్పుడో పదేళ్ల క్రితం మొదలు పెట్టి.. 8 ఏళ్ల క్రితం పూర్తైన సినిమా. పలుమార్లు రిలీజ్ వాయిదా పడుతూ ఎట్టకేలకు ఇప్పటికీ మోక్షం దక్కించుకుంది. బెంగాల్ సూపర్ స్టార్ దేవ్, శుభశ్రీ గంగూలీ సిక్త్ -టైమ్ జోడీ కదుతుండటంతో బెంగాల్ వ్యాప్తంగా విపరీతమైన హైప్ క్రియేట్ అయింది. ఈ ఇద్దరు గతంలో జూనియర్ ఎన్టీఆర్, సమంత, కాజల్ నటించిన బృందావనం బెంగాల్ రీమేక్ వర్షన్ ఖోకా420 వర్షన్‌లో కలిసి నటించారు. ఈ సినిమా బెంగాల్‌లో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. దీంతో ఈ జంటకు హిట్ పెయిర్‌గా క్రేజ్ వచ్చింది. ఈ హిట్‌పెయిర్ ఇప్పుడు ధూమకేతుతో మరోసారి జంటగా రాబోతున్నారు. ఆగస్టు14న రిలీజ్ అవుతోన్న ధూమకేతు ఒకవేళ పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే బెంగాల్‌లో వార్2 కలెక్షన్లకు గండిపడినట్లే అవుతుంది.



RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644. Web: shenarthimedia.in, Epaper:epaper.shenarthimedia.in